# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక

మార్చి ౨౦౨౬



శ్రీ ప్రణవపీఠం
सत्यं वद - धर्मं चर
ఏలూరు



# మార్చి, 2026

మార్చి , 2026

## విషయ సూచిక

సంపుటి-5
సంచిక-3


01 సంపాదకీయం
బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

02 శ్రీ గణేశ పురాణం
శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య

03 శ్రీ వేంకటేశ్వర రహస్యం
శ్రీమతి నడుముక్కల శ్రీకరి

04 శ్రీ మత్స్యమహాపురాణం
మద్దూరి వేంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణ

05 ఐశ్వర్యయోగం
బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

06 ఋషిచరిత్ర
శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం

07 కాశీ కథలు
శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం

08 స్తోత్రమాలిక
బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్




శ్రీ మహాగణాధిపతయే నమః　　శ్రీ గురుభ్యోనమః　　శ్రీ మాత్రేనమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

https://srivaddipartipadmakar.org


© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.


# శ్రీ గురుభ్యోనమః

# సంపాదకీయం

## కాలమే పరమాత్మ స్వరూపం



విశ్వమంతా కాల స్వరూపమైన పరమాత్మ లీలా విలాసమే. మనం తిరగేసే క్యాలెండర్ పుటలు కేవలం తేదీల మార్పులు కావు; అవి మన కర్మలను సరిదిద్దుకోవడానికి ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన అవకాశాలు. 2026 మార్చి నెల విశ్వావసు నామ సంవత్సర ఫాల్గునానికి, శ్రీ పరాభవ నామ సంవత్సర చైత్రానికి వారధి.పంచాంగం అంటే కేవలం ముహూర్తాల పట్టిక కాదు. అది మన ఆధ్యాత్మిక ప్రయాణానికి దిక్సూచి. తిథి సంపదను పెంచుతుంది, వారం ఆయురారోగ్యాలను అందిస్తుంది, నక్షత్ర స్మరణం వల్ల పాపం తొలగుతుంది, యోగాన్ని స్మరించడం వల్ల రోగం తొలగుతుంది. కరణాన్ని స్మరిస్తే కార్యసిద్ధి కలుగుతుంది. కాలం కర్మ, దైవం, — ఈ మూడు అనుకూలించినప్పుడే మానవుడు శుభఫలితాలు పొందుతాడు. ఫాల్గున పూర్ణిమ నాడు హోలికా దహన కార్యక్రమం జరుగుతుంది. మనుష్యులలోని అహంకారమమకారాలు దుర్లక్షణాలు ఈ దహనం వల్ల తొలగుతాయి. రంగులు చల్లుకోవడం అంటే, సర్వవర్ణాలు చివరకు వర్ణరహితమైన ఒకే ఒక పరమాత్మను చేరుకోవడాన్ని తెలియజేస్తున్నాయి.మార్చి 19న సంవత్సరాది. దీనికి యుగాది లేక ఉగాది అని పేర్లున్నాయి. కష్టం వచ్చినా, సుఖం వచ్చినా చలించని స్థితప్రజ్ఞతను అలవర్చుకోవడమే ఈ పండుగ అంతరార్థం. సుఖదుఃఖాలకు కర్మలే కారణాలు. కనుక యుగాది నుండే సత్కర్మాచరణ ప్రారంభమవ్వాలి. మార్చి 27 శ్రీరామనవమి పర్వదినం భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి. రామునిలోని సుగుణాలు మనకు శ్రీరామరక్ష కావాలి. ప్రణవపీఠంలోని రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ప్రణవపీఠ భక్తులు గోత్రనామాలను నమోదు చేసుకొని శ్రీరామనవమి పూజా కార్యక్రమాలలో పాల్గొని తరించగలరు. ప్రణవపీఠం ప్రతినెలా పంచాంగాన్ని అందిస్తుంది. దానిని చూచి కాలాన్ని గ్రహించి చేయవలసిన పనులు చేస్తూ దేవతానుగ్రహం పొందండి.కాలస్వరూపుడైన పరమాత్ముడు అందరిని రక్షించుగాక! అని అనేక మంగళాశాసనములు చేస్తున్నాను....

వద్దిపర్తి పద్మాకర్

# శ్రీ గణేశ పురాణం

నిత్యం శ్రీకృష్ణధ్యానం చేసి భక్తిని చాటుకుంటున్న వాడివే, అయినా మోహం వల్ల శ్రీకృష్ణాంశస్వరూపుడైన గణపతిని గ్రహించలేకపోతున్నావు. ఈ పార్వతీపుత్రుడు సకల దేవతాస్వరూపుడు. ఈతనికి విష్ణువునకు భేదం లేదు. గణపతిని ఒక్కడిని సక్రమంగా అర్చిస్తే సృష్టిలోని సకల దేవతలనూ పూజించినట్లే. ప్రకృతిని పూజించినట్లే. ఆయనను తిరస్కరిస్తే అందరిని తిరస్కరించినట్లే. ఒక దూర్వాదళ పూజనంతో సంతృప్తి పొందే పరమాత్ముడు గణపతి. ఇంత తేలికగా భక్తులననుగ్రహించే దైవం మరొకడు లేడు. గణపతిని విరోధించినవాడు, శివునికి మాత్రం ప్రీతిపాత్రుడు ఎలా అవుతాడు. అందువల్ల మనఃస్ఫూర్తిగా గణేశుని పూజించి ప్రసన్నం చేసుకో. నారాయణుని మాటలు అంగీకరించాడు రాముడు. గణపతి యెడల అపరాధం చేసానని గ్రహించాడు. పశ్చాత్తప్తుడయ్యాడు. వెంటనే శివపార్వతుల పాదపద్మాలకు నమస్కరించి, గణేశుని పదాలను పూజించాడు. శ్రీహరి ఉపదేశించిన మార్గంలో గణపతిని పూజించాడు. గణపతి పూజతో సకల దోషాలూ నశించి, శాంతి లభించింది. ఆ పూజాప్రభావంతో శివపార్వతుల అనుగ్రహం కూడా లభించింది. జీవితంలో అశాంతులు తొలగి, ప్రశాంతత లభించి సాధన కొనసాగాలంటే గణేశపూజ తప్పనిసరి. ఆది పూజ్యుడు గణపతి. ఆయనకు పరశురాముడు చేసిన పూజలు ఆశ్చర్యకరాలు.

శ్లోII స్తోత్రేణ హరిణోక్తేన స తుష్టావ గణాధిపం
పూజాం చకార భక్త్యాచ నైవేద్యైః వివిధైరపి
ధూపైః దీపైశ్చ గంధైశ్చ పుష్పైశ్చ తులసీం వినా
సంపూజ్య భ్రాతరం భక్త్యా సరామః శంకరాజ్ఞయా
గురుపత్నీం గురుం నత్వా గమనం కర్తు ముద్యతః II


(బ్రహ్మవైవర్తపురాణం.తృ.ఖం.గణేశఖండం.అ.46.శ్లో.1,2,3)

పరశురాముడు హరిచే చెప్పబడిన స్తోత్రం చదివి గణాధిపతిని సంతోషపెట్టాడు. ఆ స్తోత్రం అంత శక్తివంతమైనది. గణేశునికి ఎంతో భక్తితో అనేక ఉపచారాలు చేసి, పూజించాడు. వివిధ నైవేద్యాలు సమర్పించాడు. ధూపదీపగంధపుష్పాలు సమర్పించాడు. తులసిని మాత్రం సమర్పించలేదు. తులసి గణేశపూజకు పనికిరాదు. తులసితో గణేశుని పూజిస్తే పూజ మొత్తం వ్యర్థమౌతుంది. అందుకే తులసి లేకుండా పూజించాడు.

శంకరాజ్ఞతో సోదరుడైన గణేశుని భక్తితో పూజించి, గురుపత్నికి, గురువునకు నమస్కరించి పరశురాముడు తన త్రోవన తాను వెళ్ళిపోయాడు. గణేశపూజ గురించి తెలుసుకొనేవారికి ఇక్కడ ఒక సందేహం కలుగుతుంది. తులసితో గణేశుని పూజిస్తుంటాడు కదా! రాముడు ఎందుకు తులసిని సమర్పించలేదు. తులసి ఎందు వల్ల గణేశపూజకు పనికిరాదు? ఈ అనుమానం ఒకప్పుడు నారద మహర్షికి వచ్చింది. ఆయన సాక్షాత్తుగా నారాయణునే ఈ అనుమాన నివృత్తి కోసం ఇలా ప్రశ్నించాడు.

.. ఇంకా ఉంది





# శ్రీ వేంకటేశ్వర రహస్యము

బ్రహ్మ మాటలు విన్న వసిష్ఠుడు ఆయనతో ఇలా అన్నాడు — ప్రభూ! నన్ను రక్షించే నా తండ్రివి కనుక నీకు నా బాధను నివేదించుకొంటున్నాను. వసిష్ఠుడు మహాత్ముడనీ, రాజగురువు, రాజపురోహితుడనీ ప్రజలు నన్ను పొగడుతున్నారు. అదే నా దుఃఖానికి మూలకారణం.

శ్లో॥ జానాతి మాం రాజపురోహితం భవాన్
పురోహితానాం బహుళం హి పాపమ్
తే రాజానో యద్యదఘం చరంతి
పురోహితానాం తదితి ప్రవాదః ॥
(బ్రహ్మోత్తరఖండం.అ.50.శ్లో.16)

నీవు ఎఱుగనిదేముంది? నేను రాజపురోహితుడను. పురోహితులకు అనేక పాపాలు చుట్టుకొంటాయి అని శాస్త్రాలు చెపుతున్నాయి. రాజులు ప్రజలను ఎంత ధర్మ మార్గంలో నడపుతున్నప్పటికీ కొందఱు అప్పుడప్పుడు పాపాలు చేస్తూనే ఉంటారు. ఆ పాపాలను మేము అనుభవించాలి. వాటికోసం మహాతపస్సు చేయ వలసి వస్తుంది. మా తపశ్శక్తి పాప పరిహారం కోసం వినియోగించ వలసి వస్తున్నది. కనుక నాకు ఈ మధ్యన తీవ్ర వేదన కలుగుతోంది. ప్రజలను సరిగా పాలించని రాజులు, ప్రజల పాపాలను స్వీకరించాలి. రాజు పాపాలు పురోహితులు స్వీకరించాలి. ఆ పాపానికి ప్రాయశ్చిత్తం ఎలా చేసుకోవాలో తెలియక వ్యగ్రుడనౌతున్నాను. మరొక బాధ కూడా నన్ను పీడిస్తోంది. అయోధ్యకు దగ్గఱలో ఒక పల్లెటూరు ఉంది. ఆ గ్రామంలో సర్వాబద్ధుడనబడే ఒక బ్రాహ్మణుడున్నాడు. వాడు నాస్తికుడు. దుష్టబుద్ధి. అన్నీ నీచ కృత్యాలే చెస్తుంటాడు. దురాచారాలతో బాటుగా దారిద్ర్యం కూడా వాడిని పట్టి పీడిస్తోంది. డబ్బు కోసం అన్ని రకాల గడ్డినీ కఱచే మనిషి. ఎక్కడ యజ్ఞాలు జరుగుతున్నా, బ్రాహ్మణోత్తముల సమావేశాలు జరుగుతున్నా అక్కడకు వెళ్ళి దక్షిణల కోసం గందరగోళం చేస్తుంటాడు. ఇచ్చిన దానికి సంతృప్తి పొందక, అందరి కంటె ఎక్కువ కావాలని కోరుతుంటాడు. పండితులు వాని ప్రవర్తనకు విసిగిపోయి కూడా, ఏమీ అనక చాలాకాలం ఓపిక పట్టారు. ఒకసారి ఒక యజ్ఞ వాటికలో ఆ మూర్ఖుడు చేరి గొడవ చేస్తుండడంతో అక్కడకు వచ్చిన వారిలో ఒకడు తీవ్ర స్వరంతో వాడితో ఇలా అన్నాడు.


.....ఇంకా ఉంది



# శ్రీ మత్స్యమహాపురాణం

మత్స్యరూపుడైన శ్రీమహావిష్ణువు మనువుతో ఇలా అన్నాడు సనాతనుడును, నారాయణుడని ప్రసిద్ధి పొందిన ఆ పరమాత్మయే స్వయంగా ఉద్భవించి, తనకు శరీరము కావాలని సంకల్పించుకొన్నాడు. సమస్త జగత్తును సృష్టించాలని మొదట జలాల్ని సృష్టించాడు. వాటి యందు తన వీర్యాన్ని నిలిపాడు. ఆ వీర్యమే గొప్ప పరిమాణము కల బంగారు గ్రుడ్డుగా అయింది. అది సూర్యుడు లేనిదై చీకటితో వేల సంవత్సరాల కాలం ఉండిపోయింది. మహాతేజస్స్వరూపుడైన ఆ పరమాత్మ తన వలన పుట్టిన గ్రుడ్డులోపల ప్రవేశించి, అవ్యక్తమైన మత్స్యరూపాన్ని విడిచిపెట్టి మరల విష్ణురూపాన్ని పొందాడు. దాని లోపల ఈ భగవంతుడే సూర్యుడు అయ్యాడు. ఆది భూతుడు కాబట్టి ఆదిత్యుడు, వేద వరుడగుట వలన బ్రహ్మయును అయ్యాడు. అనంతరం దివ్యమగు ఆ గ్రుడ్డు రెండు ముక్కలయింది. ఆ అండం మధ్య అన్ని దిక్కులను శాశ్వతమగు ఆకాశాన్ని నిర్మించాడు భగవంతుడు. అండము యొక్క మావిని ఆశ్రయించి లోపలి వైపున పర్వతాలు ఏర్పడ్డాయి. ఇక ఉల్బము (మావితో సంబంధించిన నీటిబుడగ) జల ప్రవాహాలు, నదులు, నానా రత్నాలు గల్గిన సముద్రాలుగా మారింది. పరమాత్ముడగు ఆ దేవుడే ప్రజలను సృష్టించాలని సంకల్పించినందువల్ల శత్రువులను అణచి వైచి ప్రజలను రక్షింపగలిగిన 'ప్రజాపతి' అయ్యాడు. అండము మృతము (చీలినది) అయిన తరువాత ఏర్పడినందువల్ల ఆతని ఆ తేజస్సునకు "మార్తాండుడ"ని పేరు వచ్చింది. ఆ భగవంతుని రజోగుణంతో కూడిన రూపం, లోకాలన్నింటికీ పితామహుడగు(తాత) చతుర్ముఖ భగవంతుడయ్యాడు. దేవాసుర మనుష్యులతో నిండిన ఈ జగత్తు అంతా ఆయన చేతనే సృష్టింపబడింది. ఈ రజోగుణ ప్రధాన పరమాత్ముని రూపమే "మహత్తత్త్వం" అని చెప్పబడుతోంది.చతుర్ముఖ భగవంతుడు అగు బ్రహ్మ మొదట తపస్సు చేసాడు. అప్పుడు అంగాలతో — ఉపాంగాలతోను, పదములు — క్రమముతో కూడిన వేదాలు ఆతనికి సాక్షాత్కరించాయి. నిత్య శబ్దమయమును, పుణ్యకరమును, శతకోటి గ్రంథ విస్తరము కలదియునగు పురాణాన్ని ధర్మశాస్త్రాలతో కూడా బ్రహ్మ స్మరించుకొన్నాడు. తరువాత ఆయన ముఖాల నుండి వేదాలు వచ్చాయి. అలాగే ఎనిమిది ప్రమాణములతో [ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, ఆగమము, అర్థాపత్తి, అసంభవము, ఐతిహ్యము, పురాణము] కూడ న్యాయవిద్యలు బయటకు వచ్చాయి. నిరంతరం వేదాలను ఆవృత్తము చేయుచునే ఉన్నవాడును, ప్రజలను సృష్టింప సంకల్పించినవాడునగు ఆతని మానసము నుండి సంకల్పంచే మొదటగా సృష్టింపబడ్డ పుత్రులు మానసపుత్రులుగా పరిగణింపబడ్డారు. వారు వరుసగా మరీచి, అత్రి, అంగిరుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, ప్రచేతుడు, వశిష్ఠుడు, భృగువు, నారదుడు.(10 మంది) వీరందరు తమ నుండి పుత్రులనుత్పన్నులనుజేసి జీవింపజేసినవారు. [నారదుడు వరాహ పురాణం ప్రకారం సారస్వతుడను బ్రాహ్మణుడు. సంసార భారమును పుత్రునిపై పెట్టి విష్ణుమూర్తిని గూర్చి తపస్సుజేసి, బ్రహ్మకు జన్మించి సాయుజ్యం పొందే వరం పొందాడు].

....ఇంకా ఉంది



# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః శ్రీ మాత్రేనమః శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 352. వహ్నిమండల వాసినీ –(ఓం ఐం హ్రీం శ్రీం వహ్నిమండల వాసిన్యై నమః)



మన శరీరంలోని ఆరు చక్రాలలో అతి ముఖ్యమైనది మూలాధార చక్రం. ఈ మూలాధారంలో 'వహ్ని మండలం' అనే పేరుతో ఒక మండలం ఉంటుంది. ఇది అగ్ని స్వరూపం. అక్కడ అమ్మవారు నివసిస్తుంది కాబట్టి ఆమెకు 'వహ్ని మండల వాసిని' అని పేరు.అదేవిధంగా, మన శరీరంలో ఉండే పరమాకాశాన్ని (కొందరు దీనిని సహస్రారకమలం అని కూడా అంటారు) అక్కడ కూడా అమ్మవారు ఉంటుంది కాబట్టి, ఆమెను 'వహ్ని మండల వాసిని' అని పిలుస్తారు. వహ్ని అనే పదం మూడు అగ్నులకు (త్రేతాగ్నులకు) చిహ్నం. కాబట్టి వహ్ని అంటే 'మూడు' అని కూడా అర్థం. చంద్రుడు, సూర్యుడు మరియు అగ్ని - ఈ ముగ్గురినీ కలిపి 'మండల త్రయం' అంటారు. ఈ ముగ్గురిలోనూ అమ్మవారే ఉంటుంది కాబట్టి ఆమెను 'సోమ సూర్యాగ్ని మండల వాసిని' అని కూడా అంటారు. ఇటువంటి అమ్మవారిని తలచుకొన్నవారికి మహా పాపాలన్నీ తొలగిపోతాయి.

### మంత్ర ప్రయోగం — ఫలితం

ప్రతి దినము రాత్రి పడుకోబోయే ముందు లేదాఉదయం నిద్రలేవగానే (స్నానం చేసిన తర్వాత), సూర్యోదయ లేదా సూర్యాస్తమయ సమయాల్లో ఈ మంత్రాన్ని జపించాలి.కనీసం 40 దినాల పాటు ఈ నియమాన్ని పాటించాలి. ఇలా చేయడం వల్ల చేసిన మహాపాపాలన్నీ భస్మమైపోతాయి. పాపాలు తొలగిపోవడం వల్ల అనుకున్న పనులన్నీ నెరవేరుతాయి (కార్యసిద్ధి కలుగుతుంది). ఈ నామ జపం చేసేవారు అమ్మవారికి తీపి పదార్థాలను (పటికబెల్లం, బెల్లం వంటివి) నైవేద్యంగా సమర్పించి, దానిని తాము తిని ఇతరులకు కూడా పెట్టాలి.

... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

# దుర్వాస మహర్షి

దుర్వాస మహర్షికి సంబంధించిన అత్యంత ప్రసిద్ధ కథల్లో ఒకటి ఇంద్ర శాప కథ. ఒకసారి దుర్వాసుడు ఇంద్రునికి ఇచ్చిన పుష్పమాలను ఇంద్రుడు అహంకారంతో తన ఐరావతం తలపై వేసాడు. ఆ మాలను ఐరావతం నేలపై పడేసింది. ఈ అవమానాన్ని భరించలేక దుర్వాసుడు ఇంద్రునికి శాపం ఇచ్చాడు. దాని ఫలితంగా దేవతలు తమ శక్తి, వైభవాలను కోల్పోయారు. ఈ సంఘటన చివరికి సముద్ర మథనం అనే మహత్తర ఘట్టానికి దారితీసింది. అమృతావతరణం, లక్ష్మీదేవి ఆవిర్భావం వంటి మహత్తర సంఘటనలు ఈ శాపం వల్లనే సంభవించాయి. ఇక్కడ దుర్వాసుని శాపం ఒక విధ్వంసానికి కాదు, లోకానికి మేలు చేకూర్చిన మహా పరిణామానికి కారణమైంది.మరొక ప్రసిద్ధ ఘట్టం అంబరీష మహారాజు కథ. అంబరీషుడు పరమ విష్ణుభక్తుడు. ఒకసారి ద్వాదశీవ్రత సందర్భంలో దుర్వాసుడు ఆలస్యంగా రావడంతో అంబరీషుడు ఉపవాస నియమాన్ని కాపాడేందుకు కేవలం జలప్రాశనం చేసాడు. దీనిని అవమానంగా భావించిన దుర్వాసుడు అతనిపై శాపం విధించడానికి ప్రయత్నించాడు. కానీ విష్ణుభక్తి కారణంగా సుదర్శన చక్రం దుర్వాసునినే తరిమింది. చివరికి దుర్వాసుడు విష్ణువు వద్దకు, అక్కడి నుంచి అంబరీషుని వద్దకు వెళ్ళి క్షమాపణ కోరాడు. ఈ కథ ద్వారా భక్తి ముందు తపోబలం కూడా తలవంచుతుందని పురాణాలు స్పష్టంగా తెలియజేస్తాయి.

దుర్వాస మహర్షి శ్రీకృష్ణునితో కూడిన సంఘటనల్లో కూడా కనిపిస్తాడు. పాండవుల అరణ్యవాస సమయంలో దుర్వాసుడు శిష్యులతో కలిసి భోజనానికి వస్తాడు. ఆ సమయంలో అక్షయపాత్ర ఖాళీగా ఉంటుంది. శ్రీకృష్ణుని కృపతో ఆ సంక్షోభం తీరుతుంది. ఈ సంఘటనలో కూడా దుర్వాసుడు భక్తులను పరీక్షించే ఒక సాధనంగా దర్శనమిస్తాడు.దుర్వాస మహర్షి వ్యక్తిత్వాన్ని లోతుగా పరిశీలిస్తే, ఆయన కోపం కేవలం భయపెట్టే లక్షణం కాదు; అది ధర్మానికి కాపలాదారు. ఆయన శాపాలు మనుషులలో అహంకారాన్ని తొలగించడానికి, ధర్మ మార్గాన్ని గుర్తు చేయడానికి ఉపయోగపడ్డాయి. అదే సమయంలో ఆయన భక్తుల పట్ల అత్యంత దయగలవాడు, వరప్రసాదకుడు కూడా.దుర్వాస మహర్షి కథల ద్వారా పురాణాలు మనకు చెప్పే ప్రధాన సందేశం ఏమిటంటే — ధర్మం, వినయం, భక్తి ఉన్న చోట అహంకారానికి స్థానం లేదు.తపస్సు ఎంత గొప్పదైనా, భక్తి మరియు వినయం లేకపోతే అది ఫలించదు. దుర్వాసుని కోపం మనలను భయపెట్టడానికి కాదు; మనలోని అహంకారాన్ని దహనం చేయడానికి. అందువల్ల దుర్వాస మహర్షిని కేవలం "కోపిష్టి ఋషి"గా చూడకుండా, ధర్మ సంరక్షకుడిగా, భక్తి మహిమను ప్రకటించిన మహానుభావుడిగా చూడాలి. అప్పుడే ఆయన పురాణ పాత్ర యొక్క అసలైన మహత్యం మనకు స్పష్టమవుతుంది.

.ఇంకావుంది




# కాశీ కథలు

## దివోదాసుని వృత్తాంతం

శివుడు ఢుంఢి గణపతిని స్తోత్రము చేసెను . ఆ స్తోత్రమును మనుషులు చేస్తే కలుగు శుభములను వివరించెను. ఆ తర్వాత కాశీ యందు 56 రూపములతో ఏడు ఆవరణలలో కొలువుదీరిన వినాయకుడిని ,ఆయన రూపములను దర్శించడం వల్ల కలుగు ఫలితములను వివరించెను

| ఆవరణ | గణపతి నామము | దర్శనము వలన కలుగు ఫలితం |
|---|---|---|
| పంచమ | స్థూలదంత వినాయకుడు | సజ్జనులకు సిద్ధి కలుగును |
| పంచమ | కలిప్రియ వినాయకుడు | తీర్థ ద్రోహులకు నిత్యము కలహము కలిగించును |
| పంచమ | చతుర్దంత వినాయకుడు | విఘ్నములు హరించును |
| పంచమ | ద్విముఖ వినాయకుడు | విఘ్నములు హరించును |
| పంచమ | జ్యేష్ఠ వినాయకుడు | విఘ్నములు హరించును |
| పంచమ | గజ వినాయకుడు | సంపత్తిని కలిగించును |
| పంచమ | కాల వినాయకుడు | కాల భయమును తొలగించును |
| పంచమ | నాగేశ వినాయకుడు | నాగలోక వాసము కలుగును |



కాశీ లో పంచమ ఆవరణ నుండి భక్తులకు సర్వసిద్ధులను అనుగ్రహించి శుభములను కలుగజేస్తూ భక్తులను కాశీలో అనుగ్రహిస్తూ ఉన్నారు గణపతి. గణపతి స్వామి దుష్టులను, అభక్తులను దుర్మార్గులను కాశీ నుండి బయటకు పంపివేయును

.ఇంకాఉంది

## శ్రీ శివమానస పూజా స్తోత్రమ్

రత్నైః కల్పితమాసనం హిమజలైః స్నానం చ దివ్యాంబరం

నానారత్నవిభూషితం మృగమదామోదాంకితం చందనమ్|

జాతీచంపక బిల్వపత్రరచితం పుష్పం చ ధూపం తథా

దీపం దేవ దయానిధే పశుపతే హృత్కల్పితం గృహ్యతామ్ ||1||

సౌవర్ణే నవరత్నఖణ్డరచితే పాత్రే ఘృతం పాయసం

భక్ష్యం పంచవిధం పయోదధియుతం రంభాఫలం పానకమ్|

శాకానామయుతం జలం రుచికరం కర్పూరఖణ్డోజ్జ్వలం

తాంబూలం మనసా మయా విరచితం భక్త్యా ప్రభో స్వీకురు ||2||

ఛత్రం చామరయోర్యుగం వ్యజనకం చాదర్శకం నిర్మలం

వీణాభేరి మృదంగ కాహలకలా గీతం చ నృత్యం తథా|

సాష్టాంగం ప్రణతిః స్తుతిర్బహువిధా హ్యేతత్సమస్తం మయా

సంకల్పేన సమర్పితం తవ విభో పూజాం గృహాణ ప్రభో ||3||

ఆత్మా త్వం గిరిజా మతిః సహచరాః ప్రాణాఃశరీరం గృహం

పూజా తే విషయోపభోగరచనా నిద్రా సమాధిస్థితిః|

సంచారః పదయోః ప్రదక్షిణవిధిః స్తోత్రాణి సర్వా గిరో

యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనమ్ ||4||

కరచరణకృతం వాక్కాయజం కర్మజం వా

శ్రవణనయనజం వా మానసం వాఽపరాధమ్|

విహితమవిహితం వా సర్వమేతత్క్షమస్వ

జయ జయ కరుణాబ్ధే శ్రీ మహాదేవ శంభో ||5||